
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కొడుకును కొట్టి చంపిన తండ్రి 6

అంతా గణితమయం
- ప్రొఫెసర్ వైఎన్‌రెడ్డి
- గీతంలో జాతీయ గణిత దినోత్సవం


రూ. 5 లక్షలు.. 60 గజాలు



ఇందిరమ్మ ఇళ్ల మోడల్ సిద్ధం

ఎంపీడీవో కార్యాలయాల ఆవరణలో నిర్మాణం

- మెదక్ జిల్లాలో 22 మండల కేంద్రాల్లో స్థలాలు కేటాయించిన ప్రభుత్వం
- సోమవారం మెదక్‌లో శ్రీకారం



ఇందిరమ్మ ఇంటి మ్యాప్

మెదక్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నమూనా సిద్ధమైంది. మోడల్ ఇళ్ల నిర్మాణాలకు స్థల సేకరణకు అధికారుల అన్వేషణ పూర్తయ్యింది. మండల అభివృద్ధి కార్యాలయాల ఆవరణలో నమూనా ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణాల్లోనే ఇందిరమ్మ ఇళ్ల మోడల్ నిర్మాణాలు చేపట్టాల్సిందిగా రాష్ట్ర సర్కార్ సర్క్యులర్ విడుదల చేసింది. మెదక్ జిల్లాలో 22 మండల కేంద్రాల్లో వీటిని నిర్మించడానికి ఏర్పాట్లు చేశారు. మెదక్ ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో సోమవారం పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. హవేళీఘనపూర్ మండల కార్యాలయం పక్కన ప్రభుత్వ స్థలంలో మోడల్ ఇల్లు నిర్మించనున్నారు.

సర్కారు సాయంలోనే..

ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు కేటాయించనుంది. ఈ మొత్తంతో ఏవిధంగా ఇల్లు నిర్మించుకోవచ్చనేది ప్రయోగాత్మకంగా చూపడానికే నమూనాలను సిద్ధం చేస్తున్నారు. ఇంటి నిర్మాణానికి కనీసం 60 గజాల స్థలం ఉండాలని ప్రభుత్వం నిబంధన విధించింది. ఇందులో స్లాబ్ ఏరియా 400 చదరపు అడుగుల విస్తీర్ణం ఉంటుంది. 12.5 వెడల్పు, 10.5 పొడవుతో పడక గది నిర్మించనున్నారు. 6.9 వెడల్పు, 10 చదరపు అడుగుల విస్తీర్ణంతో వంట గది, 9 అడుగుల పొడవు, 10 అడుగుల వెడల్పుతో ముందు గది నిర్మిస్తున్నారు. ఇక డాబా పైకి మెట్లు ఇంటి యజమాని ఆప్షన్‌గా పేర్కొన్నారు. దీంతో పాటు స్నానాల గది, వాష్‌రూమ్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన మ్యాప్ కూడా రూపొందించినట్టు హౌసింగ్‌శాఖ డీఈ యాదగిరి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో నమోదు ప్రక్రియ , లబ్ధిదారుల ఎంపిక తదితర అంశాల పర్యవేక్షణకు నోడల్ అధికారిగా పంచాయితీరాజ్ ఇంజనీర్ నర్సింహులును నియమించారు. పర్యవేక్షణకు మరో ఇద్దరు ఏఈలు త్వరలోనే బాధ్యతలు చేపట్టనున్నట్టు అధికారులు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూం ఇండ్లకు సంబంధించి జిల్లా కలెక్టరేట్‌లో ఒక గదిని కేటాయించారు. ప్రస్తుతం ఆ గదినే వీరికి కేటాయించినట్లు సమాచారం. కాగా ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయంలోనే అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

సర్వేలో సాంకేతిక ఇబ్బందులు

గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని సిబ్బంది వాపోతున్నారు. మొబైల్ సిగ్నల్ సరిగ్గా రాకపోవడంతో సర్వేలో వేగం మందగిస్తోంది. మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో సర్వర్ డౌన్ అవుతోందని చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రజాపాలనలో 1,91,100 మంది ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 25.05 శాతం సర్వే పూర్తయింది. ఈ నెల 25 వరకు సర్వే పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కానీ, ఈ నెలాఖరుకు సమయం పట్టవచ్చని సిబ్బంది పేర్కొంటున్నారు.

కుమిలిపోయాం.. మళ్లీ ప్రాణం వచ్చింది

బోరుమన్న లగచర్ల బాధితులు.. జైలు నుంచి విడుదలైన 17 మంది

వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం లగచర్లలో కలెక్టర్, అధికారులపై దాడి ఘటనలో అరెస్టయి.. కంది జైలులో ఉన్నవారు శుక్రవారం ఉదయం విడుదలయ్యారు. నెలరోజులకుపైగా సంగారెడ్డి సెంట్రల్ జైలులో ఉన్న లగచర్ల, పులిచెర్లకుంట తండా, రోటిబండ తండా, హకీంపేట గ్రామాలకు చెందిన 17 మందికి కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో జైలు వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జైలు గేటు నుంచి బయటకు వచ్చినవారు కుటుంబసభ్యులను చూసి బోరుమన్నారు. వారికి అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, బీఆర్ఎస్ నేత జైపాల్‌రెడ్డి, గిరిజన సంఘాల నాయకులు స్వాగతం పలికారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కన్నీరుమున్నీరయ్యారు. 'పోలీసు దెబ్బల నొప్పులు, కుటుంబసభ్యులు గుర్తొచ్చి ఇన్నాళ్లు జైలులో కుమిలిపోయాం.. బయటకు రావడంతో మళ్లీ ప్రాణం వచినట్లుంది' అని పేర్కొన్నారు. 7



జైలు నుంచి విడుదలై బయటికి వస్తున్న లగచర్ల రైతులు

నాలుగు కొత్త మున్సిపాలిటీలు

కోహీర్.. గడ్డపోతారం.. గుమ్మడిదల.. ఇస్నాపూర్



కోహీర్ గ్రామపంచాయతీ

కోహీర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో కొత్తగా నాలుగు మున్సిపాలిటీలు ఏర్పడనున్నాయి. కోహీర్, గడ్డపోతారం, గుమ్మడిదల, ఇస్నాపూర్‌లు మున్సిపాలిటీలుగా ఆవిర్భవించాయి. ఈ విషయాన్ని అసెంబ్లీ సమావేశంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. గవర్నర్ ఆమోదం తెలపగానే మేజర్ గ్రామపంచాయతీలను మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నట్టు తెలిసింది. మున్సిపాలిటీగా ఆవిర్భవించిన కోహీర్‌కు సమీపంలోని కొన్ని గ్రామాలను విలీనం చేస్తారా అనేది ఇంకా తెలియరాలేదు. తదుపరి ఉత్తర్వులు రాగానే పూర్తిస్థాయిలో కోహీర్ మున్సిపాలిటీ కార్యకలాపాలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని అధికారవర్గాలు చెబుతున్నాయి. మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయడంపై గ్రామస్థులు సంతోషం వ్యక్తంచేశారు. మండల కేంద్రంలో శుక్రవారం టపాసులు కాల్చి, మిఠాయిలు పంచారు. మేజర్ గ్రామపంచాయతీ అయిన కోహీర్‌ను మున్సిపాలిటీగా మార్చాలని గ్రామపంచాయతీ పాలకవర్గం మూడేళ్ల క్రితమే తీర్మానం చేసింది. అప్పట్లోనే మంత్రులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు గతంలోనూ శాసనసభ సమావేశాల్లో ప్రస్తావించారు.

మున్సిపాలిటీ నుంచి పంచాయతీకి

1954 నుంచి 1974 వరకు కోహీర్ మున్సిపాలిటీగానే కొనసాగింది. అప్పట్లో మున్సిపాలిటీకి సంబంధించి వనరులు లేకపోవడం, సిబ్బందిని నియమించకపోవడంతో మేజర్ గ్రామపంచాయతీగా మార్చారు. యాభై ఏళ్లుగా మేజర్ గ్రామపంచాయతీగా కొనసాగిన కోహీర్‌కు ఎనిమిది మంది సర్పంచులుగా కొనసాగారు. ప్రస్తుతం కోహీర్ జనాభా 20 వేల వరకు ఉంటుంది. సమగ్ర కుటుంబ సర్వేలో సేకరించిన వివరాల ప్రకారం 3,400 కుటుంబాలు ఉన్నాయి. నాలుగు ఎంపీటీసీ స్థానాలు, 18 వార్డులున్నాయి.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి

ఫార్ములా ఈ-రేస్‌పై అసెంబ్లీలో చర్చపెట్టండి

హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచారు

మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి 7

ఫిర్యాదు చేస్తే బెదిరింపులు

- సంగారెడ్డి జిల్లాలో నంబర్ల మాయాజాలం
- ఒక్కో నంబర్ ప్లేట్‌తో రెండేసి వాహనాలు
- యాత్రలకు వ్యాన్లు, ఇసుక రవాణాకు టిప్పర్లు
- యథేచ్ఛగా తిరుగుతున్న ఇతర రాష్ట్రాల బండ్లు
- ఫిర్యాదు చేస్తే భయభ్రాంతులకు గురిచేస్తున్న ఆర్టీఏ అధికారులు

6

గవర్నర్, ముఖ్యమంత్రి పర్యటనలకు పక్కాగా ఏర్పాట్లు

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్
- ఏడుపాయల, కొల్చారంలో పరిశీలన



ఏడుపాయలలో ఏర్పాట్లను పరివేక్షిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

పాపన్నపేట/కొల్చారం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, 25న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మెదక్ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను కలెక్టర్ రాహుల్‌రాజ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 22న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ మెదక్ చర్చిని సందర్శించడంతో పాటు కొల్చారంలో సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల మరియు కళాశాలలను పరిశీలించనున్నట్టు తెలిపారు. ఈ నెల 25న ముఖ్యమంత్రి కువంత్‌రెడ్డి మెదక్ చర్చి, ఏడుపాయల అమ్మవారి దర్శించుకోనున్నట్లు తెలిపారు. ప్రాంగణంలో ముఖ్యమంత్రివర్యులు అమ్మవారిని దర్శించుకునే ప్రాంతం, పార్కింగ్ ప్రదేశాలు, హెలిప్యాడ్ ప్రదేశాలను పరిశీలించి ఏర్పాట్లపై తగు సూచనలు సలహాలు అధికారులకు అందించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.

దివ్యాంగుల వైద్య శిబిరం పరిశీలన

మెదక్ కల్చరల్: మెదక్ జిల్లా ఆసుపత్రిలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక దివ్యాంగుల వైద్య శిబిరంలో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగులకు అన్నివిధాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఏలాంటి అనారోగ్య సమస్యలైనా పరిష్కరించాలని, ఉచిత నాణ్యమైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి నెల రెండో మంగళవారం ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నామని దివ్యాంగులు వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి శ్రీరామ్, వైద్యాకళాశాల ప్రిన్సిపాల్ రవీంద్ర కుమార్, జిల్లా ఆసుపత్రుల సమన్వయ కర్త శివదయాల్, సూపరింటెండెంట్ కిరణ్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ నవీన్, వివిధ విభాగల వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీమా సొమ్ము స్వాహా చేసిన నిందితురాలు అరెస్టు

హవేళీఘణపూర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భర్త బతికుండగానే తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి రైతుబీమా సొమ్ము స్వాహాచేసిన నిందితురాలిని అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు హవేళీఘణపూర్ ఎస్సై సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బూర్గుపల్లికి చెందిన లెంక మల్లేశం బతికుండగానే రైతు బీమా డబ్బులు స్వాహా చేశారని బూర్గుపల్లి ఏఈవో స్వాతి ఈ నెల 17న ఫిర్యాదు చేశారు. లెంక మల్లేశం భార్య లెంక పద్మను విచారించగా బీమా సొమ్ములు స్వాహా చేసినట్టు తేలడంతో అరెస్టు చేసి సంగారెడ్డి జైలుకు తరలించినట్లు తెలిపారు.

నేరాల నియంత్రణకు చర్యలు



నేర సమీక్షలో మాట్లాడుతున్న మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, అదనపు ఎస్పీ మహేందర్

మెదక్ అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మెదక్‌లోని జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఆయన నేర సమీక్ష నిర్వహించారు. పెండింగ్ కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసుస్టేషన్ పరిధిలోని గ్రామాలను సందర్శించాలని పోలీసు అధికారులకు సూచించారు. తరచుగా తగాదాలకు, నేరాలకు పాల్పడేవారిపై నిఘా పెట్టాలన్నారు. పోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. పెండింగ్ కేసులు, గుర్తుతెలియని మృతదేహాల కేసులను త్వరగా ఛేదించాలన్నారు. సమాచార వ్యవస్థను పటిష్ఠం చేసుకొని, ప్లాన్ ఆఫ్ యాక్షన్‌తో పని చేయాలని సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఆవశ్యకత, సైబర్ నేరానికి గురైతే టోల్ ఫ్రీ నెంబర్ 1930 కాల్ చేయడంపై పై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీలు ప్రసన్నకుమార్, సుభాష్‌చంద్రబోస్, జిల్లా సీఐ, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

జైలు, బాలసదనంలో జడ్జి తనిఖీలు

రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలమేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచనలతో శుక్రవారం పట్టణంలోని సబ్‌జైలు, బాలసదనాన్ని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ జితేందర్ తనిఖీ చేశారు. జైలులో వంట గదిని పరిశీలించారు. ఖైదీల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. బాలసదనంలో ఉంటున్న పిల్లల చదువు, ఆరోగ్యం, వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు.

మాకూ చలేస్తోంది!





సంగారెడ్డి జిల్లాలో చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో తగ్గుతున్నాయి. చలి తీవ్రతకు జనం గజగజ వణికిపోతున్నారు. తాళలేక పిల్లలు, వృద్ధుల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా తయారైంది. మనుషులతో పాటు మూగజీవాలకూ చలి బెడద తప్పడం లేదు. పెంపుడు కుక్కలకు చలి నుంచి రక్షించేందుకు ఇలా స్వెట్టర్లు, టీషర్టులు వేస్తున్నారు.

-సంగారెడ్డి జిల్లా ఫొటోగ్రాఫర్, (ఆంధ్రజ్యోతి)

మల్లన్న కల్యాణ ఏర్పాట్లు 25లోగా పూర్తవ్వాలి

- భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలగొద్దు
- క్యూకాంప్లెక్స్ నిర్మాణ పనులు ఆపేయండి : సిద్దిపేట కలెక్టర్



అధికారులకు సూచనలిస్తున్న సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

చేర్యాల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లన్న కల్యాణోత్సవానికి ఈనెల 25లోగా ఏర్పాట్లు పూర్తిచేయాలని, అన్ని ప్రభుత్వశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి సూచించారు. ఈ నెల 29న మల్లన్న కల్యాణం నిర్వహించనున్న నేపథ్యంలో శుక్రవారం కలెక్టర్, సీపీ అనురాధ ఆలయాన్ని సందర్శించారు. స్వామివారిని దర్శించుకుని, ఏర్పాట్లు పరిశీలించారు. కల్యాణం జరిగే తోటబావి వేదికవద్ద పటిష్ఠ బారీకేడ్లు, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అంతరాయం ఏర్పడకుండా విద్యుత్ సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఆలయ పరిసరాల్లో ప్రతీ షాపులో ఫైర్‌మేజర్ స్టేఫీ పరికరాలను నెలకొల్పాలని సూచించారు. 24 గంటలపాటు తాగునీటిని సరఫరా చేయాలని, ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి, అంబులెన్సులు అందుబాటులో ఉంచాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా బందోబస్తు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. ఆరు బయట నుంచి క్యూలైన్లు ఏర్పాటుచేయనున్నందున ఆలయ ప్రాంగణంలోని క్యూ కాంప్లెక్స్ భవనం నిర్మాణ పనులు నిలిపి వేయాలని చెప్పారు. అనంతరం ఎల్లమ్మగుట్టపై అమ్మవారిని దర్శించుకున్నారు. అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయనవెంట అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్, డీఆర్‌వో నాగరాజమ్మ, ఈవో బాలాజీ, విద్యుత్‌శాఖ ఎస్ఈ చంద్రమోహన్, డీఎంఅండ్‌హెచ్‌వో పల్వన్‌కుమార్, డీపీవో దేవకీదేవి, తదితరులు పాల్గొన్నారు.

అంతా గణితమయం

● ప్రొఫెసర్ వై.ఎన్.రెడ్డి ● గీతంలో ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

పటాన్‌చెరు రూరల్, డిసెంబరు 20 : ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోగలిగే ఏకైక భాష గణితం అని, గణితం లేని ప్రదేశం, జీవితం లేదని, అంతా గణితమయమని ఎన్‌ఐటీ వరంగల్ గణిత శాస్త్ర ఆచార్యుడు ప్రొఫెసర్ వైఎన్ రెడ్డి అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రముఖ గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. గణితం: నేర్చుకునే భాష అనే అంశంపై డాక్టర్ వైఎన్ రెడ్డి ఉపన్యసించారు. భారతీయులకి గణిత శాస్త్రంపై పట్టు అపారమని, దీనిని యువత గుర్తెరిగి, ఆ రంగంలో రాణించేందుకు యత్నించాలని పిలుపునిచ్చారు. గణితంపై పట్టు సాధిస్తే, ఎంతటి చిక్కు సమస్యనైనా సులువుగా పరిష్కరించవచ్చని, అందుకే భారతీయులు అత్యున్నత స్థానాలలో రాణిస్తున్నట్టు చెప్పారు.

గడ్డి మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

రాయపోల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గడ్డి మందు తాగిన ఒకరు చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన రాయపోల్ మండల పరిధిలో శుక్రవారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎల్కల్ గ్రామానికి చెందిన ప్రవీణ్‌చారి(25) ఈనెల 9న గడ్డి మందు తాగగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందాడు.



ఒకే నంబరుతో సంగారెడ్డిలో తిరుగుతున్న ఇతర రాష్ట్రాల వాహనాలు (ఫైల్)





ఫిర్యాదు చేస్తే బెదిరింపులు

● సంగారెడ్డి జిల్లాలో నంబర్ల మాయాజాలం
● ఒక్కో నంబర్ ప్లేట్‌తో రెండేసి వాహనాలు
● యాత్రలకు వ్యాన్లు, ఇసుక రవాణాకు టిప్పర్లు
● యథేచ్ఛగా తిరుగుతున్న ఇతర రాష్ట్రాల బండ్లు
● ఫిర్యాదు చేస్తే భయభ్రాంతులకు గురిచేస్తున్న ఆర్టీఏ అధికారులు

కంది, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనాలు ఒకే నంబర్ ప్లేట్‌పై సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా యథేచ్ఛగా తిరుగుతున్నాయి. దర్జాగా రెండు వాహనాలు తిరుగుతన్నా ఆర్టీఏ అధికారులు నిమ్మకునీరెత్తనట్టుగా వ్యవహరిస్తున్నారు. కర్ణాటక, మహారాష్ట్రాల సరిహద్దులు కలిగిన సంగారెడ్డి జిల్లాలో డబుల్ నంబర్ల మాయాజాలం హాట్‌టాపిక్‌గా మారింది. ఇలా తిరుగుతున్న వాహనాలపై జిల్లాలోని ట్రావెల్ ఏజెన్సీల వారు ఆర్టీఏ అధికారులకు ఫిర్యాదు చేస్తే.. మీకేం సంబంధం అంటూ బెదిరిస్తున్నారని వారు వాపోతున్నారు.



ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం

ఆర్టీఏ అధికారుల నుంచి బెదిరింపులు

కొన్ని రోజులుగా జిల్లా పరిధిలోని జహీరాబాద్, సదాశివపేట, సంగారెడ్డి, పటాన్‌చెరు తదితర పట్టణాల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన ఓన్ నంబర్ ప్లేట్ కలిగిన వాహనాలు రెండేసి, మూడేసి తిరగడాన్ని 'ఆంధ్రజ్యోతి' ఈనెల 4న వెలుగులోకి తీసుకొచ్చింది. అదే సమయంలో కొందరు ట్రావెల్ ఏజెన్సీ నిర్వాహకులు డబుల్ నంబర్ వాహనాలతో, ఇతర రాష్ట్ర ట్యాక్సీలతో తమకు నష్టం వాటిల్లుతుందని ఏఐటీయూసీ నాయకులతో కలిసి కందిలోని సంగారెడ్డి ఆర్టీఏ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అయితే వారికి న్యాయం చేయాల్సిన ఆర్టీఏ అధికారులు పట్టనట్టుగా వ్యవహరించారు. కాగా, రెండేసి నంబర్లతో తిరుగుతున్న వాహనాల్లో ఒకదాన్ని ఆర్టీఏ అధికారులు పట్టుకుని కొన్ని రోజులు వారి ఆధీనంలో ఉంచుకొని వదిలేసినట్లు సమాచారం. మరో వాహనాన్ని నియంత్రించడం కోసం ఎలాంటి ప్రయత్నాలు చేయనట్లు తెలుస్తున్నది. అంతేకాక ఈ విషయం వెలుగులోకి తీసుకవచ్చిన కొందరు ట్రావెల్ ఏజెన్సీ నిర్వాహకులను ఆర్టీఏ అధికారులు వారి కార్యాలయంలోకి పిలిపించుకుని వరుస క్రమంలో నిలబెట్టి వీడియోలు తీయిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తూ బెదిరించారని వారు వాపోయారు. 'మీకేం అధికారం ఉందని, మీరేమైనా ప్రభుత్వ అధికారులా' అంటూ దూషిస్తూ భయపెడుతున్నారని తెలిపారు. అంతేకాక అలాంటి వాహనాల విషయాల్లో జోక్యం చేసుకున్న వారి ట్రావెల్ ఏజెన్సీలను ఆర్టీఏ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఆర్టీఏ అధికారుల తీరుతో తమకు తీవ్ర మానసిక క్షోభ కలిగిందని, అందుకే తాము మానవ హక్కుల సంఘంతో పాటు ప్రజా సంఘాలకు ఫిర్యాదు చేయనున్నట్లు ట్రావెల్ ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు. డబుల్ నంబరు ప్లేటున్న వాహనాలను ఆర్టీఏ అధికారులు ప్రోత్సహిస్తున్నారా, లేక రాజకీయ ఒత్తిడికి తలగుతున్నారా అనేది తెలియాల్సి ఉన్నది.

మహారాష్ట్ర వాహనాల వైపే మొగ్గు

జిల్లాలోని జహీరాబాద్, సదాశివపేట, సంగారెడ్డి పటాన్‌చెరు పట్టణాల్లో అయ్యప్ప స్వామి మాల ధరించిన భక్తులు శబరి మలై యాత్ర కోసం తక్కువ ధరకు వస్తున్నాయని మహారాష్ట్రకు సంబంధించిన ట్యాక్సీ వాహనాలను ఎక్కువగా బుక్ చేయడంతో ఇక్కడి ట్రావెల్ ఏజెన్సీ నిర్వాహకులు నష్టాల్లో కూరుకుపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మహారాష్ట్రలో మినీ వ్యాన్లకు 10 ప్లస్ 2 సీట్ల వరకు ఓన్ నంబర్ ప్లేట్‌తో అక్కడి రవాణా శాఖ అధికారులు అనుమతులు ఇస్తున్నట్టు సమాచారం. అయితే ఇక్కడ కొందరు దళారులు రాజకీయ నాయకుల అండదండలతో, రవాణశాఖ అధికారులను గుప్పెట్లో పెట్టుకుని మహారాష్ట్రలో పర్మిషన్‌తో ఓన్‌ప్లేట్ కలిగిన చిన్నచిన్న వ్యాన్లు కొనుగోలు చేసుకుంటున్నారు. వాటిని మన రాష్ట్రంలో తిప్పడమే కాకుండా, ఆ వాహనాలకు సంబంధించిన పరిమితిని 25 సీట్లకు పెంచి అతి తక్కువ ధరలకు యాత్రలకు అద్దెలకిస్తూ వాహనాలను ఇష్టరాజ్యంగా నడుపుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీనివల్ల సంగారెడ్డి జిల్లాలో క్రమం తప్పకుండా రోడ్డు టాక్సీ కడుతున్న స్థానిక ట్రావెల్ ఏజెన్సీ నడుపుతున్న నిర్వాహకులు నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● గత రెండు సంవత్సరాల క్రితం కంది మండలంలోని బ్యాతోల్‌లో అక్రమ ఇసుక రవాణా చేస్తూ కొన్ని లారీలు, టిప్పర్లు రెవెన్యూ అధికారులకు పట్టుపడ్డాయి. వీటిలో కొన్నిటికి డబుల్ నంబర్ ప్లేట్ ఉండడం గమనార్హం. ఈ విషయమై అప్పటి రవాణా శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తే తూతూ మంత్రంగా తనఖీ నిర్వహించారు తప్ప డబుల్ నంబర్ ప్లేట్ కలిగిన వాహనాలను కట్టడి చేయలేకపోయారు

● ఈ నెలలో సదాశివపేట పట్టణంలో, సంగారెడ్డిలో మహారాష్ట్రకు సంబంధించిన ఒకే నంబర్ గల రెండు మినీ వ్యాన్లు తిరుగుతుంటే ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకొచ్చింది. ఇప్పటివరకు ఆ వాహనాలను అడ్డుకోవడంలో రవాణా శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.



కొడుకును కర్రతో కొట్టి చంపిన తండ్రి

పటాన్‌చెరు రూరల్, డిసెంబరు 20 : జులాయిగా తిరుగుతూ మద్యానికి బానిసగా మారిన కుమారుడిని తండ్రే కొట్టి చంపిన ఉదంతం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండల పరిధిలో శుక్రవారం చోటుచేసుకున్నది. బీడీఎల్ సీఐ స్వామిగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం క్యాసారం గ్రామానికి చెంది. అత్తెల్లి వెంకటరెడ్డి (34) రోజు మద్యం తాగుతూ.. మత్తులో తల్లిదండ్రులపై దాడులకు పాల్పడేవాడు. రెండేళ్ల క్రితం తండ్రి అనంత్‌రెడ్డిపై దాడికి పాల్పడడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా వెంకట్‌రెడ్డిపై కేసు కూడా నమోదైంది. అయినా తీరు మార్చుకోకుండా తల్లిదండ్రులను వేధిస్తుండేవాడు. అదే గ్రామంలో ఉంటున్న సోదరి ఇంటికి వెళ్లి ఊరు వదిలి వెళ్లిపోవాలంటూ బెదిరించాడు. వెంకట్‌రెడ్డికి వివాహం కాగా, అతడి చర్యల వల్ల భార్య వదిలేసి వెళ్లిపోయింది. ఈ క్రమంలో శుక్రవారం తండ్రీకొడుకుల మధ్య గొడవ జరిగింది. తీవ్ర ఆగ్రహానికి గురైన అనంతరెడ్డి కొడుకు వెంకట్‌రెడ్డి తలపై కర్రతో బలంగా కొట్టాడు. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మనోహరాబాద్ డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందిన సంఘటన శుక్రవారం మండల పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా సూతారిగూడ గ్రామానికి చెందిన నత్తి మల్లేష్ (75) మనోహరాబాద్ నుంచి మేడ్చల్ వైపు బైక్‌పై వెళుతుండగా 44వ జాతీయ రహదారిపై దండుపల్లి వద్దకు రాగానే అతి వేగంతో వచ్చిన డీసీఎం ఢీకొన్నది. మల్లేష్ తలకు తీవ్ర గాయాలై కిందపడటంతో స్థానికులు మేడ్చల్ ప్రభుత్వాస్పత్రికి తలించగా వైద్యులు పరిక్షించి మృతిచెందడని తెలిపారు. కుమారుడు నత్తి శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


గూడ్స్ రైలుపైకి ఎక్కి హల్‌చల్

చేగుంట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి) : చేగుంట మండలం వడియారం రైల్వేస్టేషన్‌లో శుక్రవారం ఓ వ్యక్తి ఆత్మహత్యకు ప్రయత్నం చేశాడు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ముఖేష్ వడియారం రైల్వే స్టేషన్‌లో ఆగివున్న పెట్రోల్‌తో కూడిన గూడ్స్ రైలు ట్యాంక్ పైకి హైటెన్షన్ విద్యుత్ వైర్లు పట్టుకోవాడానికి ప్రయత్నం చేశాడు. అది గమనించిన రైల్వే స్టేషన్‌లోని పాయింట్స్ మేన్ దేవేందర్, సిబ్బంది అతనికి నచ్చజేప్పి చాకచక్యంగా కిందికి దింపారు. దాంతో పెనుప్రమాదం తప్పింది.


గూడ్స్ రైలుపై నుంచి దింపేందుకు ప్రయత్నిస్తున్న రైల్వే సిబ్బంది

పీడీఎస్ బియ్యం నిల్వ చేసిన రైస్‌మిల్లుపై కేసు

రామాయంపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : భారీగా పీడీఎస్ బియ్యాన్ని నిల్వ చేసిన ఓ రైస్‌మిల్లుపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కేసు నమోదు చేశారు. గురువారం మిల్లులో సోదాలు కొనసాగగా.. 300 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అధికారుల బృందం స్వాధీనపరచుకున్న విషయం విధితమే. అయితే అర్ధరాత్రి దాకా తనిఖీలు జరిపిన పిదప అధికారుల బృందం మిల్లు నిర్వాహకులపై చర్యలు చేపట్టారు. ఈ మేరకు శుక్రవారం మరోమారు పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు చేరుకుని బియ్యం లెక్కలు తేల్చారు.







క్రైం కార్నర్

కేజ్ వీల్స్ కింద పడి డ్రైవర్ మృతి


ప్రభాకర్ (ఫైల్)

వెల్దుర్తి, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి) : ప్రమాద వశాత్తు ట్రాక్టర్ కేజ్ వీల్స్ కింద పడి డ్రైవర్ మృతిచెందిన ఘటన మండలంలోని ఆరెగూడెంలో శుక్రవారం చోటు చేసుకున్నది. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మెరుగు ప్రభాకర్(37) అదే గ్రామంలోని కుక్కల శంకర్ వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం పొలం దున్నుతుండగా ప్రమాదవశాత్తు కిందపడగా ట్రాక్టర్ వెనకభాగంలో ఉన్న గొర్రు తలకు తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రభాకర్‌ను వెంటనే తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని అక్కడి వైద్యులు నిర్ధారించారు. ప్రభాకర్‌కు భార్య యశోద, పదేళ్లలోపు ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఘటనపై భార్య యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

అప్పులబాధతో ఒకరి ఆత్మహత్య


ప్రభాకర్ (ఫైల్)

సిద్దిపేట రూరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో మనస్తాపానికి గురై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేట రూరల్ మండలం పెద్దలింగారెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్నది. సిద్దిపేట రూరల్ పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన కొమ్మురాజుల కనకయ్య(48) ఐదేళ్ల క్రితం ఇల్లు నిర్మించుకున్నాడు. ఇద్దరు ఆడపిల్లలకు వివాహం చేశాడు. దీంతో రూ.15 లక్షల వరకు అప్పులు అయ్యాయి. వాటిని తీర్చే క్రమంలో ఇంటిపై, ట్రాక్టర్‌పై ప్రైవేటు బ్యాంకులో రుణం తీసుకున్నాడు. అయినప్పటికీ అప్పులు తీరకపోవడంతో రోజు ఇంటి వద్ద బాధపడుతుండేవాడు. గురువారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. రాత్రంతా వెతికినా ఆచూకీ తెలియలేదు. ఉదయం మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు కనకయ్యను వెతుకుతుండగా గ్రామానికి చెందిన ఓ రైతు మామిడి తోటలో చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. కనకయ్య కుమారుడు కొమ్మురాజుల కిషన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగిన ఆటో డ్రైవర్..

చికిత్స పొందుతూ మృతి


పంగ యాదగిరి మృతదేహం

రాయపోల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన రాయపోల్ మండలం పరిధిలో చోటుచేసుకున్నది. బాధిత కుటుంబ సభ్యులు, రాయపోల్ ఎస్‌హెచ్‌వో దేవయ్య కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన పంగ యాదగిరి(48) కొంతకాలంగా కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో ఉంటూ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 14న తన ఆటోలో కొత్తపల్లి గ్రామానికి వచ్చిన అతడు ఆర్థిక, కుటుంబ సమస్యలతో పురుగుల మందు తాగాడు. ఈ విషయం గమనించిన గ్రామస్థులు ఆయనను గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

- చెరువు వద్ద దుస్తులు, సెల్‌ఫోను, చెప్పులు లభ్యం
- లభించని ఆచూకీ


ప్రభాకర్ (ఫైల్)

శివ్వంపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజుల నుంచి పిట్టలవాడలో ఓ వ్యక్తి వ్యక్తి అదృశ్యమైన సంఘటన శుక్రవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని సికింద్లాపూర్ పిట్టలవాడకు చెందిన విక్రమ్ కూలీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈనెల 18న రాత్రి 10 గంటలకు భోజనం చేసి కుటుంబ సభ్యులతో కలిసి పడుకున్నాడు. ఉదయం భార్య సునీత చూసేసరికి విక్రమ్ కనిపించలేదు. చుట్టుపక్కల బంధువుల దగ్గర వెతికినా ఆచూకీ తెలియలేదు. గురువారం గోమారం చెరువు చుట్టుపక్క ప్రాంతంలో వెతుకుతుండగా చెరువు వద్ద విక్రమ్ చెప్పులు, ప్యాంట్, ఫోన్ లభించిందని కానీ అతడి ఆచూకీ తెలియలేదు. భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.


లగచర్ల బాధితులకు స్వాగతం పలుకుతున్న అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, బీఆర్ఎస్, గిరిజన సంఘాలు నాయకులు

కుమిలిపోయాం.. మళ్లీ ప్రాణం వచ్చింది

బోరుమన్న లగచర్ల బాధితులు.. జైలు నుంచి విడుదల



'పోలీసు దెబ్బల నొప్పులతో, కుటుంబసభ్యులు గుర్తొచ్చి ఇన్నాళ్లు జైలులో కుమిలిపోయాం.. బయటకు రావడంతో మళ్లీ ప్రాణం వచినట్లుంది' అని లగచర్ల బాధితులు తెలిపారు. గత నెల వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం లగచర్లలో కలెక్టర్, మరికొందరు అధికారులపై దాడిచేసిన ఘటనలో అరెస్టయిన వారు శుక్రవారం ఉదయం విడుదలయ్యారు. నెలరోజులకుపైగా సంగారెడ్డి సెంట్రల్ జైలులో ఉన్న లగచర్ల, పులిచెర్లకుంట తండా, రోటిబండ తండా, హకీంపేట గ్రామాలకు చెందిన 17 మందికి షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది. వారి విడుదల నేపథ్యంలో కందిలోని జైలు గేటు వద్ద పోలీసులు భారీ ఎత్తున మోహరించారు. లగచర్ల బాధితులు జైలు గేటు నుంచి మూటముల్లెలను పట్టుకుని భావోద్వేగంతో నడుచుకుంటూ రోడ్డుమీదకు వచ్చారు. అక్కడ తమ కుటుంబసభ్యులను చూసి ఒక్కసారిగా బోరుమన్నారు. వారికి అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, బీఆర్ఎస్, గిరిజన సంఘాల నాయకులు స్వాగతం పలికారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నాడు నెట్‌వర్క్ తీసేసి, అర్ధరాత్రి ఒంటి గంటకు ఊర్ల మీద పడి ఎత్తుకెళ్లిన ఘటనను గుర్తు చేసుకుని కన్నీరుమున్నీరయ్యారు. అరెస్టయ్యామనే సంగతి కూడా ఎవ్వరికి తెలియకుండా చేసి, పరిగి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి చిత్రహింసలు పెట్టినట్లు తెలిపారు.

- కంది, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి)

గుండె సమస్య ఉందని చెప్పినా వినలేదు



నాకు ఆరోగ్యం బాగాలేదని, గుండెనొప్పి సమస్య ఉందని చెప్పినా పోలీసులు విడవకుండా అన్యాయంగా అరెస్ట్ చేశారు. పరిగి పోలీస్‌స్టేషనుకు తోలుకొచ్చి ఇష్టం వచ్చినట్లు కొట్టారు. మా భూమి ఇవ్వాలని తొమ్మిది నెలల నుంచి తిప్పల పెడుతున్నారు. మా రెండు తండాలు, మూడు గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రజలను ఎన్నో విధాలుగా ఇబ్బంది పెట్టారు. సీఎం బంధువులు మాపై దాడి చేశారు. మేము ప్రభుత్వానికి భూములు ఇస్తే మా పరిస్థితి ఏంటి. నాకు ఐదు ఎకరాల భూమి ఉన్నది. ఎకరాకు పది లక్షలు ఇంటికో ఉద్యోగం అంటే ఎలా ఇచ్చేది. కలెక్టర్ దాడి చేసిన ఘటనలో నేను లేనే లేను. నన్ను అన్యాయంగా ఇరికించారు.

- హీర్యానాయక్, పులిచెర్ల కుంట తండా

కుటుంబ సభ్యులు గుర్తొచ్చి రోజూ కుమిలిపోయాను



వ్యవసాయం చేసుకుని బతికే నన్ను అక్రమ కేసులో దోషిని చేశారు. పోలీసులు కొట్టింది చాలక జైల్లో పెట్టించారు. ప్రతీ రోజు కుటుంబ సభ్యులు గుర్తుకొచ్చి కుమిలిపోయేవాడిని. భయంతో రాత్రిపూట జైలులో నిద్రపట్టేది కాదు. మమ్మల్ని ఎంత వేధించినాగానీ మా భూమలును వదులుకోం. ఆ రోజు దాడి ఘనటలో మేం లేకున్నాగానీ మమ్మల్ని బలవంతంగా నిర్బంధించారు.

- లక్ష్మయ్య, లగచర్ల

చావనైనా చస్తాం.. భూములైతే ఇవ్వం



ఫార్మా ఇండస్ట్రీ కోసం, మరే పరిశ్రమ కోసమూ మా భూములను వదులుకోం. మేము వ్యవసాయాన్ని నమ్ముకున్నాం. తాతముత్తాతల కాలం నుంచి వ్యవసాయమే మాకు జీవనాధారం. చావనైనా చస్తాం కానీ భూములు మాత్రం ఎవ్వరికీ ఇవ్వం. మా భూముల్లో వ్యవసాయమే చేయాలని నిర్ణయించుకున్నాం. మాలాంటి అన్నదాతలకు అందరూ అండగా ఉండాలి. అన్యాయంగా అక్రమంగా మాపై కేసులు బనాయించి జైల్లో పెట్టారు.

- దోరమని బాలకృష్ణయ్య, హకీంపేట

ఈ గొడవతో ఇన్నాళ్లు కుటుంబానికి దూరం



నేను విడుదల అవుతున్నాని నా కూతురు జైలు వద్దకు వచ్చింది. వేయి కండ్లతో నా రాక కోసం నిరీక్షించింది. తనను చూడగానే నాకు మళ్లీ ప్రాణం వచ్చినట్లు అయ్యింది. ఈ దరిద్రం గొడవల వల్ల ఇన్ని రోజులు కుటుంబానికి దూరంగా బతకాల్సి వచ్చింది. పోలీసులు మమ్మల్ని ఎన్ని ఇబ్బందులకు గురి చేసినా గానీ మేము భూముల్ని మాత్రం ఎవ్వరికీ ఇయ్యం. చచ్చే వరకు పోరాడైనా భూముల్ని దక్కించుకుంటాం.

-జర్పు ఈర్యానాయక్, రోటి బండ తండా

జీవితంలో జైలు చూస్తా అనుకోలే



నా జీవితంలో జైలు అంటే ఎలా ఉంటుందో చూస్తా అని అనుకోలేదు. అన్యాయంగా అరెస్టు చేసి తీసుకొచ్చారు. నేను సౌదీలో పని చేసుకుంటాను. భోజనం చేసి టీవీ చూసి పడుకున్న. సాయంత్రం 6 గంటలకు ఒక్కసారిగా అకస్మాత్తుగా 30 మంది పోలీసులు వచ్చి మాపై దాడి చేశారు. నా మొబైల్ తీసుకున్నారు. పరిగి సబ్ జైల్లో పెట్టి మమ్మల్ని కొట్టారు. కేసు ఉన్న కారణంగా.. నేను వీసా కోసం కట్టిన డబ్బు వృథా అయింది. ఆరోజు దాడి జరిగిన సమయంలో నేను అక్కడ లేను. గుండెలు పగిలేలా ఏడ్చిన పోలీసులు కనికరించకుండా విచక్షణారహితంగా కొట్టి జైల్లో పెట్టారు. మా వాళ్లు గుర్తుకొచ్చి జైల్లో ప్రతిరోజు మనోవేదనకు గురి అయ్యాను.

-పాత్లవత్ శ్రీనునాయక్

పోలీసులు అత్యుత్సాహం చూపారు

కలెక్టర్‌పై దాడి జరిగిన రోజు మా గ్రామంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. దాడి ఘటనలో ఎవరున్నారో చూడకుండా వారికి కనపడిన ప్రతి ఒక్కరిని కొట్టి, ఇష్టరాజ్యంగా అరెస్టులు చేశారు. పోలీస్‌స్టేషన్ తీసుకెళ్లి నేరస్తుల కంటే ఘోరంగా మమ్మల్ని కొట్టారు. కనీసం మా కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడనివ్వకుండా నిర్బంధించారు. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమే. మాలాంటి అమాయక ప్రజలను, అన్నదాతలను జైల్లో వేయడం సబబు కాదు.

- బసప్ప మాజీ సర్పంచ్

కరెంటు తీసేసి.. ఎంక్వయిరీ ఉందని చెప్పి



అర్ధరాత్రి ఒంటిగంటకు కరెంటు తీసేసి ఎంక్వయిరీ ఉంది అని చెప్పి మిమ్మల్ని బలవంతంగా అరెస్టు చేశారు. పోలీసు ఇష్టారాజ్యంగ కొట్టి వారి ప్రతాపాన్ని మాపై చూపారు. ఇంది రమ్మ రాజ్యంలో రైతులను వేధించడం సబబుగా ఉందా. భూములు ఇవ్వకుంటే అక్రమ అరెస్టులు చేయిస్తారా? వ్యవసాయం చేసుకునే మేము జైలు జీవితం గడపాల్సి వచ్చింది. ఇన్ని రోజులు మనోవేదనతో మాలో మేమే కుమిలిపోయాం.

- మాణిక్య శ్రీశైలం, హకీంపేట

నా భార్య గర్భవతని చెప్పినా వినలేదు



నా భార్య గర్భవతి అని చెప్పినా వినలేదు. బలవంతంగా లాక్కొచ్చి అరెస్ట్ చేశారు. ఆ వీడియోలో పక్కన కనపడడమే నేను చేసిన పాపం. అందరికంటే ఎక్కువగా నన్నే కొట్టారు. నన్ను ఒక్కన్నే ఎనిమిది మంది పోలీసులు కొట్టారు. నన్ను ఎవరితో మాట్లాడనివ్వలేదు. ఘోరమైన బూతులు తిడుతూ అవమానించారు. ఇది రాజకీయ పార్టీల బలవంతపు అరెస్టునే తప్ప. మేము అధికారులపై ఎలాంటి దాడికి పాల్పడలేదు.

- పాత్లవత్ ప్రవీణ్ కుమార్, పులిచెర్ల కుంట తండా

కావాలనే మమ్మల్ని అరెస్ట్ చేయించారు



ఆ రోజు నాతో పాటు పది మంది పొలాల్లో పనిచేసుకుంటున్నారు. అది తెలిసినా కావాలనే మమ్మల్ని అరెస్ట్ చేయించారు. ఇన్ని రోజులు మమ్మల్ని జైల్లో ఎందుకు పెట్టారో మాకు అర్థం కావడం లేదు. మాలాంటి అమాయకులను జైల్లో పెట్టడం సమంజసం కాదు. మేమంతా వ్యవసాయం చేసుకొని బతికేటోళ్లు. పాకిస్తాన్-ఇండియా కంటే ఘోరంగా దాడి చేసి ఏదో తీవ్రవాదులను తీసుకొచ్చినట్టుగా జైల్లో పడేశారు. మాలో సగం మంది ఘటన జరిగిన ఊరిలో కూడా లేరు.

- మైలారం విష్ణువర్ధన్‌రెడ్డి, లగచర్ల

పోలీసులు విచక్షణారహితంగా కొట్టారు



పోలీసులు దౌర్జన్యంగా మా ఇండ్లలోకి ప్రవేశించారు. రాత్రి ఒంటిగంటకు తలుపులు నెట్టుకుని వచ్చారు. మా ఇంట్లోని ఆడవాళ్లు భయపడుతున్నా కూడా మమ్ములందరినీ విచక్షణ రహితంగా కొట్టారు. మేము ఎవరినైనా ఇబ్బందులు పెట్టమా. మాలాంటి అమాయక రైతులను అరెస్టు చేయడం ఈ ప్రభుత్వానికి న్యాయమేనా. ఏదేమైనా మా భూములు మాత్రమే ఎవ్వరికీయం. ప్రాణాలు అడ్డుపెట్టి అయినా సరే భూములను కాపాడుకుంటాం.

- పాత్లవత్ వినోద్, రోటి బండ తండా

ఫార్ములా ఈ-రేస్‌పై అసెంబ్లీలో చర్చ పెట్టండి

- ఈ-రేస్‌తో హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచారు
- మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ-రేస్‌లో ప్రపంచ దేశాలు పోటీపడితే అప్పటి మంత్రి కేటీఆర్ చాకచక్యంతో రాష్ట్రానికి తీసుకొచ్చి హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచారని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. ఫార్ములా ఈ-రేస్‌లో కేటీఆర్‌పై అక్రమ కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఆమె మెదక్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎలాంటి అవినీతి జరగకున్నా కేటీఆర్‌ను అక్రమంగా అరెస్ట్ చేయాలని ప్రభుత్వం చూస్తుందని ఆరోపించారు. ఈ-రేసు ద్వారా రాష్ట్రానికి రూ.700 కోట్ల ఆదాయం వచ్చిందన్న విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించాలన్నారు. దీంతో పాటు హైదరాబాద్‌కు ఎలక్ట్రిక్ వాహన సంస్థలు రావడంతో లక్షల సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. ఈ-రేసుకు కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మొదట ఆమోదం తెలిపి, తర్వాత రద్దు చేశారన్నారు. అధికార పార్టీకి ధైర్యం ఉంటే అసెంబ్లీ సాక్షిగా ఫార్ములా ఈ రేస్‌పై శాసనసభలో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట మున్సిపల్ వైస్‌చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, కౌన్సిలర్లు నాయకులు ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, మామిళ్ల అంజనేయులు, కృష్ణాగౌడ్, కొట్టాల విశ్వం తదితరులు ఉన్నారు.


మెదక్‌లో మాట్లాడుతున్న పద్మాదేవేందర్‌రెడ్డి,


సంగారెడ్డిలో మాట్లాడుతున్న రావుల శ్రీధర్‌రెడ్డి

కేటీఆర్ అవినీతికి పాల్పడ్డారనడం హాస్యాస్పదం

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఫార్ములా ఈ-రేస్‌లో కేటీఆర్ అవినీతికి పాల్పడ్డారనడం హాస్యాస్పదమని, కక్షపూరిత కేసులు పెట్టి రాక్షసానందం పొందుతున్నారని టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ మాజీ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి అన్నారు. సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలే కాని అందులో తప్పులను వెతికి సంక్షేమాన్ని అడ్డుకోవడం సరికాదన్నారు. సమావేశంలో సీడీసీ మాజీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, జైపాల్‌రెడ్డి, శ్రీహరి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, నర్సింలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి బదిలీ నిలిపివేయాలని విద్యార్థుల ఆందోళన

శివ్వంపేట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడి డిప్యూటేషన్ నిలిపివేయాలని విద్యార్థులు పాఠశాలను బహిష్కరించి ఆందోళన చేపట్టిన సంఘటన శుక్రవారం కొంతాన్‌పల్లిలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని కొంతాన్‌పల్లి ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు వెంకటేష్‌ను డిప్యూటేషన్‌పై మండల పరిధిలోని నవాబ్‌పేట్ పాఠశాలకు బదిలీ చేశారు. వెంకటేష్ తెలుగు సారే మాకు కావాలి అంటూ శుక్రవారం పాఠశాల ఎదుట విద్యార్థులు ఆందోళన చేశారు.


పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఆపరేటర్ల తప్పిదం.. ప్రజాపాలన యాప్‌లో నమోదు కాని పేరు

- న్యాయం చేయాలని ఎంపీడీవో కార్యాలయం ఎదుట బాధిత కుటుంబం నిరసన


రసీదును చూపుతున్న కావ్య, పెంటయ్య

శివ్వంపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అధికారుల తప్పిదంతో ప్రజాపాలన యాప్ డేటాలో తమ పేరు లేకపోవడంతో ఇందిరమ్మ ఇల్లు సర్వే చేయలేదని గుండ్లపల్లి గ్రామానికి చెందిన భార్యాభర్త ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకున్నది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన కూడారం కావ్య, పెంటయ్య ఐదేళ్లుగా టార్పాలిన్‌లతో ఏర్పాటు చేసుకున్న గుడిసెలో నివాసం ఉంటున్నారు. గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన సర్వేలో భాగంగా తమ ఇంటికి సంబంధించిన వివరాలను నమోదు చేసినప్పటికీ, ఇందిరమ్మ ఇల్లు యాప్‌లో వారి పేరు లేదని పంచాయతీ కార్యదర్శి సంతోష్ కుటుంబానికి తెలియజేయడంతో అవాక్కయ్యారు. న్యాయం చేయాలని ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయమై కార్యదర్శి సంతోష్‌ను సంప్రదించగా ఆపరేటర్ల తప్పిదంతో గుండ్లపల్లి గ్రామానికి చెందిన కావ్య వివరాలు యాప్‌లో వేరే గ్రామమైన గంగయ్యపల్లిలో వచ్చాయని తెలిపారు. ఎంపీడీవో నాగేశ్వరరావు సంప్రదించగా విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



సిద్దిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు

ఆశా వర్కర్లను పర్మినెంట్ చేయాలి

- రూ.26,000 వేతనం చెల్లించాలి
- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ
- సిద్దిపేటకు చేరుకున్న బస్ జాత

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆశా వర్కర్లను పర్మినెంట్ చేసి, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ అన్నారు. రాష్ట్రవ్యాప్త ఆశా వర్కర్ల సమస్యల కోసం చేపట్టిన బస్సు జాత శుక్రవారం సిద్దిపేటకు చేరుకున్నది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సుమారు పది లక్షల మంది ఆశా వర్కర్లు ఉన్నారని, 30 ఏళ్ల నుంచి కమ్యూనిటీ హెల్త్ వర్కర్లుగా, 20 ఏళ్లుగా ఆశాలు ఎన్‌హెచ్‌ఎం స్కీంలో పనిచేస్తున్నారని అన్నారు. కానీ వారికి కనీస వేతనం, ఉద్యోగ భద్రత లేవని అన్నారు. టార్గెట్‌లు పెడుతూ ఆశాలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీల సంఖ్య పెంచడంలో, దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించి అరికట్టడంలో, గ్రామాల్లో ఆరోగ్య విషయాలలో ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఇన్ని నిర్వహిస్తున్న కూడా ప్రభుత్వం గుర్తించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని లేనిచో రాష్ట్రవ్యాప్త ఉద్యమాలకు సిద్ధమవుతామని అన్నారు. పాత బస్టాండ్ నుంచి సిద్దిపేట ప్రెస్‌క్లబ్ వరకు ర్యాలీ నిర్వహించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి, జిల్లా కోశాధికారి గొడ్డుబర్ల భాస్కర్, జిల్లా సహాయకార్యదర్శి చొప్పరి రవికుమార్, ఆశ రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఐదు రోజులు సీసీఐ కొనుగోళ్లు నిలిపివేత

సదాశివపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21 నుంచి 25వ తేదీవరకు సీసీఐ కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు సదాశివపేట మార్కెట్ కమిటీ చైర్మన్ సదాకుల కుమార్, వైస్ చైర్మన్ కంది కృష్ణ, సీసీఐ కమర్షియల్ ఆఫీసర్ వరప్రసాద్ శుక్రవారం తెలిపారు. మిల్లుల్లో పత్తి నిల్వ ఎక్కువగా ఉండడంతో మండలంలోని మూడు జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోళ్లు నిలిపివేస్తున్నటు పేర్కొన్నారు. తిరిగి 26న యధావిధిగా కొనుగోళ్లు ప్రారంభమవుతాయని తెలిపారు.

'ఐక్యంగా ముందుకు సాగుదాం'

పటాన్‌చెరు రూరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి) : ఐక్యంగా ముందుకు కదిలి బలపడదామని కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్ పేర్కొన్నారు. ముదిరాజ్ మహాసభ సంఘం ఏర్పాటు వ్యవస్థాపకుడు, స్వర్గీయ కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ వర్ధంతిని చిట్కుల్‌లోని ఆయన నివాసంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి మధు పూలమాలవేసి నివాళులర్పించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

పటాన్‌చెరు, డిసెంబరు, 20 (ఆంధ్రజ్యోతి) : అమీన్‌పూర్ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా నేడు మున్సిపాలిటీ పరిధిలో పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ వెంకట్‌రాంరెడ్డి పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు మున్సిపల్ పరిధిలోని బందంకొమ్ము, శ్రీధాం, గ్రీన్‌విల్లాస్, సబ్‌స్టేషన్ వెనకవైపు, కృష్ణబృందావన్ టీచర్స్ కాలనీ, మైత్రీవ్యాలీ, శుభంఇన్‌ఫ్రా, మారుతీహిల్స్, హిల్‌టాప్ హిల్స్ త్రిపుర హోమ్స్, ఓడీఎఫ్ కాలనీ, కేజీఆర్ తదితర కాలనీలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

భూమి పూజ

నారాయణఖేడ్: ఖేడ్ పరిధిలోని నిజాంపేట మండలం మాణిక్‌నాయక్‌తండాలో దుర్గాభవానీ మాత, సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ ఆలయాల నిర్మాణానికి అఖిల భారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి, కొండాపూర్ ఆశ్రమ హనుమాన్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి భూమి పూజ చేశారు.

ఏఆర్‌టీ సెంటర్‌లో డాక్టర్ పోస్టుకు దరఖాస్తులు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని ఏఆర్‌టీ సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సూపరింటెండెంట్ అనిల్‌కుమార్ తెలిపారు. కాంట్రాక్టు ప్రాతిపదికన ఒక డాక్టర్ పోస్టు భర్తీకి ఎంబీబీఎస్ విద్యార్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు 25 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ముందస్తు అరెస్టు

నారాయణఖేడ్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య శుక్రవారం చలో అసెంబ్లీకి పిలుపునిచ్చిన నేపథ్యంలో ఖేడ్‌లో పలువురు విద్యార్థి సంఘం నాయకులను గురువారం అర్ధరాత్రి ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఉచిత వైద్య శిబిరం

కోహీర్, డిసెంబరు: కోహీర్ మండలంలోని గొటిగర్‌పల్లి రిజర్వుడ్ ఫారెస్ట్ పరిధిలో నీలగిరి చెట్లను హార్వెస్ట్ చేస్తున్న వలస కూలీలకు శుక్రవారం అటవీశాఖ జహీరాబాద్ రేంజ్, మెదక్ డివిజన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

ఇరుకు రోడ్లపై ఇక్కట్ల ప్రయాణం

- పెరిగిన వాహనాల రద్దీ
- నర్సాపూర్- సంగారెడ్డి డబుల్ లైన్ల రోడ్డుతో తరచూ ప్రమాదాలు
- రోడ్డును విస్తరించాలని వాహనదారుల వేడుకోలు


నర్సాపూర్-సంగారెడ్డి రోడ్డు వాహనాలకు తగ్గట్టు లేక ఇబ్బంది పడుతున్న వాహనదారులు

నర్సాపూర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇరుకు రోడ్లతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఘటనలో ఎందరో ప్రాణాలు కోల్పోతుండగా.. చాలామంది క్షతగాత్రులుగా మిగులుతున్నారు. మెదక్ జిల్లాలోని నర్సాపూర్-సంగారెడ్డి ప్రధాన రోడ్డు 30 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ రోడ్డు మూడు జాతీయ రహదారులను కలిపి ఉండటంతో రోజూ భారీ వాహనాలతో పాటు ఇతర వాహనాలు కూడా పెద్ద మొత్తంలో తిరుగుతుంటాయి. ప్రస్తుతం డబుల్‌లైన్ల రోడ్డు మాత్రమే ఉండటం, డివైడర్ లేకపోవడంతో వాహనాలు ఓవర్‌టేక్ చేసే సమయంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న బీవీఆర్ ఐటీ కాలేజీకి బస్సులతో పాటు విద్యార్థులు కాలేజీకి బైక్‌లపై వస్తుంటారు. అయితే రోడ్డు వెడల్పుగా లేకపోవడంతో ఇక్కడా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మధ్యనే రెండు బీవీఆర్ ఐటీ బస్సులు ఢీకొని పలువురు విద్యార్థులకు గాయాలుకాగా.. డ్రైవర్ మృతి చెందాడు. అధికారులు స్పందించి నర్సాపూర్ నుంచి బీవీఆర్‌ఐటీ వరకు డివైడర్ ఏర్పాటు చేయడమే కాకుండా.. రోడ్డును కొంతవరకు విస్తరించాలని వాహనదారులు కోరుతున్నారు.

అర్హులైన నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు: కలెక్టర్ క్రాంతి

జహీరాబాద్/మునిపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు దక్కేలా చర్యలు చేపడుతున్నామని సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి పేర్కొన్నారు. శుక్రవారం జహీరాబాద్ పట్టణంలోని రంజోల్‌లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇంటింటి సర్వేను ఆమె పరిశీలించి మాట్లాడారు. ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లను మంజూరు చేశామన్నారు. ఖాళీ స్థలం ఉండి అర్హులైన వారికి మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్లు అందజేస్తామని, ఎవరూ ఆందోళన చెందొద్దని చెప్పారు. ఇందులో భాగంగా రంజోల్‌లో గల బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. ముందుగా వంట, విద్యార్థులుండే గదులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్డీవో రాంరెడ్డి, మండల ప్రత్యేఅధికారి, వ్యవసాయశాఖ ఏడీఏ బిక్షపతి, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో మహేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు, ఎంఈవో బస్వరాజ్, డీఈఈ దీప్తిచంద్ తదితరులు పాల్గొన్నారు. చదవడంతో పాటు రాయడమూ అంతే ముఖ్యమని కలెక్టర్ వల్లూరు క్రాంతి విద్యార్థులకు సూచించారు. రూం టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మునిపల్లి మండలం కంకోల్ ప్రైమరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని డీఈవో వెంకటేశ్వర్లుతో కలిసి ఆమె ప్రారంభించారు. అనంతరం కంకోల్‌లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రామాచారి, తహసీల్దార్ ఆశాజ్యోతి, ఎంపీడీవో డాక్టర్ హరినందన్‌రావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


జహీరాబాద్ పట్టణంలోని రంజోల్‌లో ఇందిరమ్మ ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

గృహాల సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

కల్హేర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఇందిరమ్మ గృహాల లబ్ధిదారుల ఎంపిక సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయ ముఖ్య కార్యనిర్వహణ అధికారి(సీఈవో) జానకీరెడ్డి సూచించారు. ఇందిరమ్మ గృహాల సర్వే తీరును కల్హేర్‌తో పాటు మండల పరిధిలోని ఇందిరానగర్‌లో శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఎంపీపీ కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. దరఖాస్తుల్లో పొందుపరిచిన విధంగా అర్హతలు ఉంటేనే లబ్ధిదారులుగా గుర్తించాలని సూచించారు. అనంతరం మండలంలో ఈజీఎస్ పనుల నిర్వహణ తీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కల్హేర్ ఎంపీడీవో రమేష్‌బాబు, ఎంపీఈవో శ్రీనివాసులు, ఎంపీపీ కార్యాలయ పర్యవేక్షకులు సంగ్రామ్, ఈజీఎస్ ఏపీవో శ్యాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి ఏపీజీవీబీ ఇక తెలంగాణ గ్రామీణ బ్యాంకు

- టీజీబీ రీజినల్ మేనేజర్ సమత


సంగారెడ్డిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీజీబీ రీజినల్ మేనేజర్ సమత

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో కొన్ని జిల్లాలకే పరిమితమైన ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు(ఏపీజీవీబీ) ఇక తెలంగాణ గ్రామీణ బ్యాంకు పేరుతో జనవరి 1 నుంచి రాష్ట్రమంతా విస్తరించనున్నదని తెలంగాణ గ్రామీణ బ్యాంకు(టీజీబీ) రీజినల్ మేనేజర్ సమత తెలిపారు. సంగారెడ్డిలోని ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సాంకేతిక సమస్యల కారణంగా 28 నుంచి 31వ తేదీవరకు బ్యాంకింగ్ సేవల్లో భాగంగా యూపీఐ, ఏటీఎం, మొబైల్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ సేవల్లో అంతరాయం ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఖాతాదారులు ముందస్తు ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. జనవరి 1 తర్వాత ఖాతాదారులు కొత్త ఏటీఎం, పాస్‌బుక్ జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో బిజినెస్ చీఫ్ మేనేజర్ హరీశ్, అడ్మిన్ సీనియర్ మేనేజర్ రామకృష్ణ, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా కుస్తీ పోటీలు


కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

కోహీర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కోహీర్‌లోని హజ్రత్ సయ్యద్ మౌలానా మోహీజోద్దీన్ ఉర్సులో భాగంగా శుక్రవారం మౌలానా మోహీజోద్దీన్ దర్గా వద్ద నిర్వహించిన కుస్తీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీలకు కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణలోని వివిధ ప్రాంతాలకు చెందిన మల్లయోధులతో పాటు హైదరాబాద్‌కు చెందిన 50 మంది మల్లయోధులు పాల్గొన్నారు. గెలుపొందిన మల్లయోధులకు ఉర్సు కమిటీ సభ్యులు నగదు, ట్రోఫీలను అందజేశారు.

సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె విరమించం


సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద సమ్మెలో సమగ్ర శిక్షా ఉద్యోగులు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె విరమించేది లేదని సమగ్ర శిక్షా ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు దత్తు స్పష్టం చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కొన్నిరోజులుగా సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితం గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా సమ్మెకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగా మహేందర్‌రెడ్డి, పీఆర్టీయూ నాయకులు మద్దతు తెలిపారు.

బోనాల ఊరేగింపుతో సమగ్ర శిక్షా ఉద్యోగుల విన్నూత నిరసన

మెదక్ అర్బన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): తమను క్రమబద్ధీకరించాలని సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె 11వ రోజుకు చేరింది. శుక్రవారం బోనాల ఊరేగింపు నిర్వహిస్తూ.. వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. వీరికి పలు ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలిపాయి. తపస్ కొల్చారం శాఖ తరఫున ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ఆర్థిక సహాయం అందజేశారు. పీఆర్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి మహేందర్‌రెడ్డి వారి సంఘీభావం తెలిపారు. ఈ నిరసనలో జిల్లా అధ్యక్షులు రాజు, కార్యదర్శి పాషా, రాజశేఖర్, సంపత్, కనకరాజు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుడి కుటుంబానికి పరిహారం

జిన్నారం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో మరణించిన పారిశుధ్య కార్మికుడి కుటుంబానికి నష్టపరిహారం, డబుల్‌బెడ్‌రూం ఇల్లు అందజేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. బొల్లారం మున్సిపాలిటీలో గతనెల 11న విధి నిర్వహణలో మరణించిన పారిశుధ్య కార్మికుడు నర్సింహ మృతిపై జాతీయ సఫాయి కర్మచారి కమిషన్, జిల్లా అధికారులు 19న సంగారెడ్డిలో సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు మృతుడి కుటుంబానికి జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ తరఫున రూ.30 లక్షల పరిహారం అందజేయనుండగా.. రాష్ట్ర ప్రభుత్వం తరఫున డబుల్‌బెడ్‌రూంను మంజూరు చేయడానికి ఆమోదం తెలిపారు. కాగా ఎంపీ రఘునందన్‌రావు కృషితో పారిశుధ్య కార్మికుడి మృతి అంశాన్ని జాతీయస్థాయిలో ప్రస్తావించి, కుటుంబానికి న్యాయం జరిగేలా చేశారని బీజేపీ బొల్లారం మున్సిపల్ శాఖ అధ్యక్షుడు ఆనందకృష్ణారెడ్డి తెలిపారు.

క్రిస్మస్‌తో అందరి జీవితాల్లో వెలుగులు

- మాజీమంత్రి డా.చంద్రశేఖర్


పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మాట్లాడుతున్న మాజీమంత్రి డా.చంద్రశేఖర్ తదితరులు

జహీరాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ అందరి జీవితాల్లో వెలుగులు నింపుతుందని మాజీమంత్రి డా.చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రీక్రిస్మస్ సందర్భంగా కేక్ కట్‌చేసి పలువురికి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరేష్‌గౌడ్, పార్టీ మండలాధ్యక్షులు రాంలింగారెడ్డి, మక్సూద్, పట్టణ అధ్యక్షులు కండెం నర్సింహులు, నాయకులు పాల్గొన్నారు.

నిరుద్యోగ నిర్మూలనకు కృషి

- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డా.వి.నరేందర్

జహీరాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ నిర్మూలనకు తనవంతు బాధ్యతగా కృషిచేస్తానని కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డా.వి.నరేందర్ పేర్కొన్నారు. శుక్రవారం జహీరాబాద్ పట్టణంతోపాటు వివిధ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించి మాట్లాడారు. అన్నిరంగాల్లో అనుభవం ఉన్న తాను నిరుద్యోగుల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. గతంలో కొనసాగిన ఎమ్మెల్సీలు నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారన్నారు తన గెలుపునకు పట్టభద్రులు సహకరించాలన్నారు.

ముగిసిన సీఎం కప్ క్రీడలు

- చివరి రోజుల సైక్లింగ్, కరాటే పోటీలు


సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో సైక్లింగ్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో 16 నుంచి జరుగుతున్న జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడలు శుక్రవారం ముగిశాయి. చివరి రోజు కరాటే, సైక్లింగ్ పోటీలను డీవైఎస్‌వో ఖాసీంబేగ్ ప్రారంభించారు. పోటాపోటీగా జరిగిన క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఆయన జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఖాసీంబేగ్ మాట్లాడుతూ 6 నుంచి గ్రామీణస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు సీఎం కప్ క్రీడలు కలెక్టర్ సహకారం, ప్రోత్సాహంతో విజయవంతంగా నిర్వహించామన్నారు.

ప్రయాణికుల మెరుగైన సేవలకు కృషి: డీఎం

నారాయణఖేడ్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ ఆర్టీసీ డిపో ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు కృషిచేస్తామని ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. శుక్రవారం డిపోలో డయల్ యువర్ డీఎం నిర్వహించారు. ఖేడ్ నుంచి కంగ్టి, తడ్కల్ మీదుగా హైదరాబాద్‌కు బస్సులు నడవడంతో పాటు కంగ్టి నైట్ హాల్ట్ బస్సును పునరుద్ధరించాలని పలువురు ఫోన్ ద్వారా కోరారు. రాంసాన్‌పల్లి స్టేజీలో బస్టాప్ ఏర్పాటు చేయాలని 10 మంది కోరారు. 15 రోజులుగా నడపకుండా నిలిపివేసిన మోర్గి మీదుగా బీదర్‌కు బస్సులను పునరుద్ధరించాలని పలువురు కోరారు. కల్హేర్, నిజాంసాగర్‌లకు బస్సులు నడపాలని పలువురు విజ్ఞప్తి చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆయా వాటిని పరిష్కరిస్తామని డీఎం వివరించారు.

రోడ్డు పక్కన చెట్లు నరికివేత


జిన్నారం శివారులో నరికివేసిన చెట్లు

జిన్నారం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలకు అడ్డుగా వస్తున్నాయని రోడ్డు పక్కన హరితహారంలో నాటి, సంరక్షించిన చెట్లను భారీగా నరికివేశారు. జిన్నారం-బొంతపల్లి మధ్య ప్రధాన రహదారికి పక్కన ఉన్న పలుచెట్లను శుక్రవారం కొందరు నరికి వేశారు. వేల రూపాయలు ఖర్చుచేసి మొక్కలు నాటి వాటి సంరక్షించి, చెట్లుగా ఎదిగిన వాటిని విద్యుత్ తీగలకు అడ్డు వస్తున్నాయంటూ నరికి వేయడం పట్ల స్థానికులు మండిపడుతున్నారు.

23 మందికి కంటి శస్త్ర చికిత్సలు

నారాయణఖేడ్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ పట్టణంలో 18న సత్యసాయి 100వ జన్మదిన వేడుకల్లో భాగంగా సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరాన్ని నిర్వహించి 24 మందికి క్యాటరాక్ట్ చికిత్సలు అవసరమని గుర్తించారు. వారిని శస్త్ర చికిత్సల కోసం హైదరాబాద్ నానక్‌రాంగూడలోని శంకర్ కంటి ఆస్పత్రికి ప్రత్యేక వాహనంలో తీసుకెళ్లారు. అక్కడ 23 మందికి శస్త్ర చికిత్సలను విజయవంతం నిర్వహించి శనివారం ఖేడ్‌కు తీసుకొచ్చారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు శంకరప్ప శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారిని గ్రామాలకు పంపించారు.

నెలాఖరులోగా వందశాతం రుణాలు: ఏపీడీ

అల్లాదుర్గం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : డ్వాక్రా సంఘాల మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలన్న సంకల్పంతో అందిస్తున్న రుణాల లక్ష్యాన్ని ఈనెల 31లోగా వందశాతం పూర్తి చేయాలని అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ సరస్వతి ఐకేపీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అల్లాదుర్గంలోని స్త్రీశక్తి భవన్‌లో రేగోడ్, పెద్దశంకరంపేట, టేక్మాల్, అల్లాదుర్గం తదితర మండలాలకు చెందిన ఐకేపీ అధికారుతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. 2024-25 సంవత్సరానికి సంబంధించిన రుణాల మంజూరుపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం బ్యాంక్ లింకేజీ వెంకటేశ్వర్లు, ఏపీఎంలు నాగరాజు, గోపాల్, సంగీత, రామకృష్ణ పాల్గొన్నారు.

కేజీబీవీని సందర్శించిన ఆర్డీవో

మనోహరాబాద్/పటాన్‌చెరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కూచారం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలోని వంట గదులను పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గౌతమి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్ పాల్గొన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని కాలనీలు, ఎస్సీ, బీసీ బాలుర వసతిగృహాలను శుక్రవారం జీహెచ్ఎంసీ డీజీఎం శివకుమార్‌తో కలిసి కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ తనిఖీ చేశారు. పట్టణంలోని జేపీ కాలనీ, విద్యానికేతన్ స్కూల్, ముదిరాజ్‌భవన్, శాంతినగర్ కాలనీల్లో పొంగిపొర్లుతున్న డ్రైనేజీలను పరిశీలించి మరమ్మతులు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

బొల్లారంలో అక్రమ కట్టడాల కూల్చివేత

జిన్నారం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బొల్లారం మున్సిపాలిటీ 284 సర్వే నెంబరు వైఎస్సార్ కాలనీలోని ప్రభుత్వ స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని టౌన్ ప్లానింగ్ అధికారులు శుక్రవారం ఎక్స్‌కవేటర్‌తో కూల్చేశారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి, గదులు నిర్మించగా.. అధికారులు నిర్మాణాన్ని నేలమట్టం చేశారు. ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

నేడు మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం

నారాయణఖేడ్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మనూరు మండలం బోరంచలోని ఇన్‌టెక్‌వెల్‌లో శుక్రవారం ఏర్పడ్డ విద్యుత్ సమస్య కారణంగా ఖేడ్ నియోజకవర్గంలోని 250 ఆవాస ప్రాంతాలకు శనివారం మిషన్ భగీరథ పథకం ద్వారా నీటి సరఫరా జరగదని మిషన్ భగీరథ గ్రిడ్ డీఈ గాయత్రి, ఏఈ తిరుమలేష్ శుక్రవారం తెలిపారు. తాగునీటి కోసం అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని పంచగామ కమాన్ వద్ద గల సంపులోని మోటారు చెడిపోవడంతో మరమ్మతులు చేయనున్నందున శుక్రవారం ఎడ్లబజార్, పెద్దమసీదు, ప్రభుత్వ వైద్యశాల ఆవరణ, శ్రీరామ మందిర్ వద్ద ఉన్న ట్యాంకులకు నీటి సరఫరా జరగలేదు. సాయంత్రం 6 గంటలకు సరఫరాను పునరుద్ధరించారు.

PUBLIC NOTICE

The General Public is hereby inform that **Smt. Balijigudem Anitha, W/O. Nagesh,** AGE 40YEARS, OCCUPATION: BUSINESS, R/O. H NO.10-43/2, Malkapur Village, Kondapur Mandal, Sangareddy District, TELANGANA STATE,. My Client M/sSHRIRAM FINANCE LTD SANGAREDDY Branch, Sanga Reddy Dist with a Requesting to advance of Loan by Mortgaging her Property.

DESCRIPTION AND LOCATION OF THE PROPERTY.

Open Place Bearing In Sy.No.136 and 136/E, (G.P.H No.10-26/A/1/40)in Total Admeasuring 363 Sq. Yards Situated At Malkpaur Village, And G.P. Kondapur Mandal,Sangareddy District, Telangana State, Bounded by:- **North:-** House Of Mallikharjun And Other. **South:-** 12" Wide Road, **East:** Plot Of Chinthala Chunnumiya. **West:-** 30' Wide Road.
Institution if having objections, Claims interest disputed for the .above, intended transaction he / she / they may contact the undersingh with document proof substantiating his / her / their objections claims details if disputes etc., within (3) days from the date of publication please take notice that if no objection claims are received within period prescribed above. My client will proceed with transaction as if there no III party claims objections disputed in respect of above said property and thereafter no claims objectionsdisputes will be entertained.

Sd/- ARAVIND KULKARANI, Advocate,
Off: 4-7-73/B/1,Ashoka Residency,
SANGAREDDY, SANGAREDDY Dist.
PH: 8639166516

PUBLIC NOTICE

The General Public is hereby inform that **Mr BOLA SWETHA W/o THUMMALA GEETHA PRAKASH** at H.NO 2-52 MANNEVAR JALALPOOR VILLAGE, YELDURTHY MANDAL, DIST MEDAK, Telangana State 502109. My **Client SHRIRAM FINANCE LTD. NARSAPUR Branch,** Medak Dist with a Requesting to advance of Loan by Mortgaging his Property.

DESCRIPTION AND LOCATION OF THE PROPERTY

All That the bearing TOTAL extent: 115.60 SQ SYDS AT MAMBOJIPALLY VILLAGE **Bounded by: North:** EXIST 40-0 WIDE ROAD **South:** OPEN PLOT NO 71 **East:** OPEN PLACE **West:** REMAINING PLOT NO 70 (PART) OF VENDORS, Of my client If any person / Institution if having objections, Claims interest disputed for the above, intended transaction he / she / they may contact the undersingh with document proof substantiating his / her / their objections claims details if disputes etc., within (5) days from the date of publication please take notice that if no objection claims are received within period prescribed above. My client will proceed with transaction as if there no III party claims objections disputed in respect of above said property and thereafter no claims objections disputes will be entertained.

B GANESH, Advocate,
9666586876
MEDAK Dist - 502110

ఆటో కార్మికుల ముందస్తు అరెస్ట్

నారాయణఖేడ్/చిన్నశంకరంపేట/చేగుంట/వెల్దుర్తి/తూప్రాన్/మనోహరాబాద్/శివ్వంపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులను ఆదుకోవాలనే డిమాండ్‌తో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపట్టగా శుక్రవారం పోలీసులు అడ్డుకొని సంఘం నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా నాయకులు చిరంజీవి మాట్లాడారు. అరెస్ట్ అయిన వారిలో సంఘం నాయకులు సాయిలు, సల్మాన్, లక్ష్మన్, తదితరులు ఉన్నారు. చిన్నశంకరంపేటలో, చేగుంటలో ఆటోడ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు రహీం, మహేందర్, నాగరాజు, సిద్ధిరాములు, వినోద్‌కుమార్ శ్రీశైలం, నరేష్, అలిబాబ, రాజాగౌడ్, శ్రీకాంత్, మౌలానా, వెల్దుర్తిలో నరేందర్, వీరగౌడ్, దేవరాజు, మహేష్, నర్సింహులు, తూప్రాన్‌లో నాయకులు అశోక్, బాబు, ప్రభాకర్, సత్యనారాయణ, సుధాకర్, కృష్ణ, మనోహరాబాద్‌లో ఆటోడ్రైవర్లను ఎస్ఐ సుభాష్‌గౌడ్, శివ్వంపేటలో ఆటో డ్రైవర్లను పోలీసులు అరెస్ట్ చేశారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడాకారుల ఎంపిక

పాపన్నపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల కోసం కబడ్డీ జూనియర్ జిల్లా జట్ల ఎంపికలు మండల పరిధిలోని యూసుఫ్‌పేటలో ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. బాలుర విభాగంలో 125 మంది, బాలికల విభాగంలో 75 మంది పాల్గొనగా.. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను 12 మంది చొప్పున రెండు జట్లకు ఎంపిక చేశారు. ఎంపికైన బాలికలు 22 నుంచి 25 వరకు హకీంపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో, బాలురు 27 నుంచి 30 వరకు జనగాంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్, సభ్యులు కుమార్, శ్రీకాంత్, శశికుమార్, రాజాగౌడ్, రవి, తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు రోహిత్‌కుమార్

కోహీర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చింతలఘట్టు గ్రామానికి చెందిన రోహిత్‌కుమార్ సీఎం కప్ రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల జిల్లాస్థాయిలో నిర్వహించిన కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్ పొందిన రోహిత్‌కుమార్ సీనియర్ 74 ప్లస్ వెయిట్ కేటగిరీలో రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యాడు. రోహిత్‌కుమార్ రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికకావడంపై గ్రామస్థులు అభినందించారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై ఆగ్రహం

- పలుచోట్ల దిష్టిబొమ్మల దహనం


నర్సాపూర్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్/తూప్రాన్/పాపన్నపేట/మాసాయిపేట/హత్నూర/సంగారెడ్డి రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ పట్ల కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మాట్లాడిన తీరు అవమానపరిచే విధంగా ఉందని, అందుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నర్సాపూర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ కేంద్ర మంత్రిగా ఉన్న అమిత్‌షా రాజ్యాంగ నిర్మాతను అవమాన పరిచే విధంగా మాట్లాడటం విచారకరమని ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు మల్లేశం, అంజిగౌడ్, పీఏసీఎస్ చైర్మన్లు రాజుయాదవ్, వెంకట్రామ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, మాజీ ఎంపీపీలు పాల్గొన్నారు. అదేవిధంగా దళిత సంఘాల నాయకులు పంబాల భిక్షపతి, రామచందర్, సంజీవ్, యాదగిరి తదిరులు అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. తూప్రాన్‌లో అంబేడ్కర్ సంఘం నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. పాపన్నపేటలో అంబేడ్కర్ యువజన నాయకులు అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేశారు. మాసాయిపేట మండల కేంద్రంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి, కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అంబేడ్కర్‌ను అవమానపరిచే విధంగా మాట్లాడిన అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని ఏఐఎస్ఎస్‌డీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింగ్‌రాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం హత్నూరలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సంగారెడ్డి పాతబస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ కార్యదర్శి తోపాజి అనంతకిషన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కూన సంతోష్ కుమార్ మాట్లాడారు.

ప్రశ్నించడమే వినియోగదారుడి లక్ష్యం కావాలి: వేణుగోపాలకృష్ణ

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రశ్నించడమే వినియోగదారుడి లక్ష్యం కావాలని యువజన సంఘాల సమితి రాష్ట అధ్యక్షుడు, డీసీఐసీ ప్రెసిడెంట్ డా.కూన వేణుగోపాలకృష్ణ సూచించారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో వినియోగదారుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశ్నించేతత్వం లేనంత వరకు వినియోగదారుడు మోసపోతూనే ఉంటారన్నారు. అవాస్తవాన్ని వాస్తవంగా చూపించే అనుచిత ప్రకటనలపై సెంట్రల్ కన్జూమర్ ప్రొటెక్షన్ అథారిటీ(సీసీపీఏ)కి చర్యలు తీసుకునే అధికారం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.సుధామాధురి, వైస్ ప్రిన్సిపాల్ డా.సుమయ, వినియోగదారుల కమిషన్ మెంబర్ విజయ్‌కుమార్, మెడికోలు పాల్గొన్నారు.